స్పోర్ట్స్ కోటాలో 170 మందికి అడ్మిషన్లు

దుండిగల్: ప్రతిభావంతులైన క్రీడాకారులను తయారు చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. 2017 విద్యా సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం 170 మంది తమ కళాశాలల్లోని బీటెక్, ఎంటెక్, ఎంబీఏ విభాగాల్లో ఉచితంగా సీట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. ఫుట్‌బాల్ మైదానం,అంతర్జాతీయ ప్రమాణాల ఇండోర్ స్టేడియం, ప్రత్యేకమైన వాలీబాల్ కోర్టులు, అథ్లెట్ల కోసం 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌లు, క్రమం తప్పకుండా ప్రాక్టీస్ చేయడానికి ప్రొఫెషనల్ క్రికెట్ మైదానం అందుబాటులో ఉందన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి 10 మంది అత్యంత అర్హత కలిగిన ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లను నియమించామని, 153 మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఇప్పటికే వివిధ ప్రతిష్టాత్మక టోర్నమెంట్లలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారని తెలిపారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

నిజాంపేట్: బీజేపీ నిజాంపేట్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిజాంపేట్‌లోని హనుమాన్ టెంపుల్ వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపేట్ అధ్యక్షులు భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 శ్లాబులను తగ్గించడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా బడుగు, బలహీన వర్గాల వారికి లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్‌రాజు, ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి దాసి నాగరాజు, మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, నిజాంపేట్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గుప్తా, జిల్లా ఓబీసీ సెక్రటరీ రవి యాదవ్, బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, కార్యదర్శి సతీష్ కృష్ణ, కౌశిక్ నాయుడు, ఐటీ సెల్ కన్వీనర్ కిషన్, ఈశ్వరరావు, వెంకటేష్ ముదిరాజ్, నరసింహారెడ్డి, విష్ణు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై వీధి కుక్క దాడి

దుండిగల్: రెండేళ్ల బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భౌరంపేట ప్రాంతానికి చెందిన రమేష్, లావణ్య దంపతుల కుమారుడు భవిష్ (02) ఆదివారం ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో వీధి కుక్క దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన చిన్నారి భవిష్‌ను సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

చెరువు కట్టపై శిశువు మృతదేహం



కుత్బుల్లాపూర్: చెరువు కట్టపై శిశువు మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు కట్టపై ఓ మగ శిశువు మృతదేహం ఉందని ఆదివారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి వెళ్లి చూడగా.. ఎరుపు రంగు టవల్‌లో మృతి చెందిన శిశువు కనిపించింది. శిశువు జన్మించి రెండు, మూడు నెలలు అయి ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయయాత్ర పుస్తకావిష్కరణ



విజయ యాత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజాంపేట్: అమ్మ అనగానే ఆశ్రయం, ఆప్యాయత, అద్భుత జీవనయానం గుర్తుకొస్తాయి. అమ్మ ప్రేమే కుటుంబానికి పునాది. ఆ ప్రేమకు పంచదార జోడించిన వేడుక 'విజయ యాత్ర' డా.అలూరి విజయలక్ష్మి సాహితి, వైద్య సేవ సేవా యాత్ర పుస్తకాన్ని ఆదివారం నిజాంపేట్‌లోని సప్తపది గార్డెన్స్‌లో ఆవిష్కరించారు. నాలుగు దశాబ్దాల స్నేహం, ఎనిమిది దశాబ్దాల జీవన యాత్ర సేవా సప్తపది నడకలో, సజీవ స్ఫూర్తి మార్గంలో డా.విజయలక్ష్మి ఆలూరి గారి 80వ జన్మదినోత్సవం కుటుంబ సమేతంగా నిర్వహించారు. కార్యక్రమానికి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, మాజీ ఐఏఎస్ అధికారి డా.జయప్రకాశ్ నారాయణ్, మాజీ సీబీఐ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ భాషా, సాంస్కృతిక శాఖ మామిడి హరికృష్ణ, చిన్న వీరభద్రుడు అనేక మంది అక్షరయాన్ రచయిత్రులు పాల్గొన్నారు. డా.ప్రణవి స్వాగతంతో కార్యక్రమం ప్రారంభమై వంశీ కృష్ణ వందన సమర్పణతో ముగిసింది. అలూరి విజయలక్ష్మి బహుముఖీ ప్రజ్ఞ పాటవాలతో కూడిన జీవనాన్ని పుస్తకంగా ముద్రించి సావనీర్ రూపంలో ఆవిష్కరించారు.

లీకేజీలతో గోదావరి జలాలు వృథా!

- రెండు నెలలుగా పట్టించుకోని అధికారులు
- నామమాత్రంగా మరమ్మతులు
- మళ్లీ నాలుగు రోజులకే లీకేజీలు



షాపూర్‌నగర్ 900 కేఎల్ రిజర్వాయర్ వద్ద రెండు నెలలుగా వృథాగా పోతున్న నీరు

చింతల్: కళ్ల ముందే రెండు నెలలుగా తాగునీరు వృథా అవుతున్న పట్టించుకునే వారు లేరు. వందల కిలో మీటర్ల నుంచి నగరానికి తీసుకువచ్చిన గోదావరి జలాలు హెచ్‌ఎంటీ జంగల్‌లో కలుస్తున్నాయి. ఒక డీజీఎం ఇద్దరు వివిధ సెక్షన్ల మేనేజర్లు, సుమారు 50 మందికి పైగా తిరిగే షాపూర్ నగర్ రిజర్వాయర్‌లో తాగునీరు ఏరులై పారుతుంది.

రెండు నెలలుగా...

రెండు నెలల క్రితమే ఈ లీకేజీ అరికట్టేందుకు ఓ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. మరమ్మతులు చేపట్టడంతో మరల నాలుగు రోజులుకే యధావిధిగా లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోతుంది. ఈ లీకేజీ ఏర్పడిన నీటిని ప్రతిరోజు పదుల సంఖ్యలో వాటర్ ట్యాంకర్లు వాటిని నింపుకుంటాయి. వారు కూడా అధికారులకు లీకేజీ విషయమై తెల్పకపోవడంతో సుమారు రెండు నెలల పైగా నీరంతా హెచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశంలోకి వెళ్తుంది. సుమారు 50 నుంచి 60 మంది సిబ్బంది ఎదురుగా నిత్యం నల్ల నుంచి నీరు వృథాగా పోతున్నా ఏ ఒక్కరు కూడా నల్లాను అమర్చే పని చేపట్టకపోవడంతో కొన్ని రోజులుగా 24 గంటల పాటు తాగునీరు వృథాగా పోతుంది. అదేవిధంగా చేసిన పనులకు సైతం కాంట్రాక్టర్లకు బిల్లులు నమోదు చేయకపోవడంతో సుమారు ఏడాదికి పైగా అవి రికార్డులు కూడా రాయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు కాంట్రాక్టర్లు కూడా ఒక నల్లని కూడా ఏర్పాటు చేయలేకపోతున్నారు అన్న ఆరోపణ వినిపిస్తోంది.

వాటర్ ఫౌంటెన్‌ను తలపిస్తూ..

కూకట్‌పల్లి బాలానగర్‌కు చెందిన రిజర్వాయర్ షాపూర్‌నగర్ రిజర్వాయర్ ఆవరణలో సెవెన్ ఎం.ఎల్ కెపాసిటీతో నిర్మించిన విషయం తెలిసింది. షాపూర్ నగర్ నుంచి వెళ్లే 600 భారీ పైపులైన్ బాలానగర్‌కు వెళ్తుంది. ఆదివారం మధ్యాహ్నం హెచ్‌ఏఎల్ గేట్ నెంబర్ వన్, గేట్ నెంబర్ 2 మధ్యలో ఉన్న ఎయిర్ వాల్వ్ అకస్మాత్తుగా పేలిపోయింది. దీంతో అప్పటికే నీటి సరఫరా కొనసాగుతుండగా.. ఈ నీరు సుమారు 20 మీటర్ల ఎత్తులో పైకి ఎగిసిపడి వాటర్ ఫౌంటెన్‌ను తలపించింది. ఈ పైపులైన్ బాలానగర్‌లోని హెచ్‌ఏఎల్ ఎన్‌ఆర్‌ఐసీ తదితర ప్రభుత్వ విభాగాలకు వెళ్తుంది. కిలో మీటర్ మేర పారడంతో పాటు హెచ్‌ఐఎల్ రెండవ గేటు లోపలికి కూడా నీరు ఏరులై పారింది. దీంతో హెచ్‌ఐఎల్ సిబ్బంది షాపూర్‌నగర్ వెళ్లి ప్రధాన పైపులైన్‌ను బంద్ చేయడంతో నీటి సరఫరా నిలిచిపోయింది.



బాలానగర్ వెళ్లే దారిలో ఫౌంటెన్‌ను తలపించిన గోదావరి జలాలు



హెచ్‌ఈఎల్ గేటు లోపల పారుతున్న గోదావరి నీరు



షాపూర్‌నగర్ రిజర్వాయర్ వద్ద సిబ్బంది ఉపయోగించే నల్లా వద్ద 24 గంటలు పారుతున్న నీరు

మౌలిక వసతుల కల్పనకు ఎల్లవేళలా కృషి



ఎమ్మెల్యే వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

రంగారెడ్డినగర్: నియోజకవర్గంలో ప్రజల అవసరాల కోసం మౌలిక వసతుల కల్పనకు ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పన్నెండేళ్లుగా కోట్లాది రూపాయల నిధులు కేటాయించి నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్తీ సీనియర్ నాయకుడు కార్తీక్ గౌడ్, సంక్షేమ సంఘం నాయకులు ఉదయ్ గంజి, జనార్ధన్, మోహన్, అంజి, యశ్వంత్, వసంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలని వినతి

జీడిమెట్ల డివిజన్ శ్రీనివాస్ నగర్ ఫేజ్ 3 సంక్షేమ సంఘం సభ్యులు తమ కాలనీలోని పార్కుకు ప్రహరీ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పార్కుకు ప్రహరీ లేకపోవడంతో ఆక్రమణకు గురయ్యే అవకాశముందని వివరించారు. రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆయన పార్కు ప్రహరీకి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, కోశాధికారి సురేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సుధాకర్, మాలాద్రీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి



హమాలీల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్

కుత్బుల్లాపూర్: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, లేని పక్షంలో ప్రభుత్వ స్థలాలు, డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆక్రమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఆదివారం సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ కార్యాలయంలో పారిశ్రామిక ప్రాంత లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు ఎలాంటి చట్టాలు, హక్కులు లేకుండా పని చేస్తున్నారని, వారికి కనీసం ఉండడానికి ఇళ్లు లేక వేల రూపాయలు అద్దెలు చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందడం లేదన్నారు. సొంత ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా ఏళ్ల తరబడి ఎదురు చూపులు తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 18 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎవరికి కేటాయించకపోవడంతో ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే పేద ప్రజలకు అప్పగించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో నిరుపేదలకు అప్పగిస్తామన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, కరుణాకర్, అంజయ్య, నర్సింహులు, దుర్గ నాయక్, తిమ్మప్ప, శ్రీశైలం, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం



కుత్బుల్లాపూర్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం క్లబ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ మెంబర్లుగా ఉన్న 25 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ 320 -బి డిస్ట్రిక్ గవర్నర్ లయన్ సెల్వ సాయిరామ్ రాజు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మారుతున్న తల్లిదండ్రుల ధోరణి ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. గతంలో విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైతే దండించేవారని తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నేడు పిల్లలను ఏమాత్రం దండించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం ఆందోళన కలిగించే విషయమన్నారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్న విషయాన్ని అందరూ గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. డిస్ట్రిక్ కౌన్సిల్ లయన్ వినోద్ జాదవ్ అధ్యక్షతన జరిగింది.

సత్తా చాటిన విద్యార్థులు



కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీలోని బాలకృష్ణ హైస్కూల్‌లో ఆదివారం పైల్వాన్ క్లబ్ స్టేట్ లెవెల్ ఇంటర్ స్కూల్ ఛాంపియన్‌షిప్ 2025-26 అండర్ 10 విభాగం పోటీలు నిర్వమించారు. ఈ పోటీల్లో ఆదిత్యనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. చెస్‌లో మొదటి బహుమతి చైత్రేశ్, పరుగుపందెంలో ద్వితీయ బహుమతి రిహాన్, పరుగు పందెం తృతీయ బహుమతి దీపా విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల నిర్వాహకులు అభినందించారు.

కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగింత



సుభాష్‌నగర్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ లీమా కథనం ప్రకారం.. సూరారం శివాలయం నగర్‌లో నివాసముండే లవ్లేష్ శుక్ల కుమారుడు సాకేత్ (7) ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానికంగా ఉన్న బ్రహ్మంగారి ఆలయం వద్ద ఆడుకుంటూ తప్పిపోయాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చుట్టుపక్కల కాలనీలో వెతికారు. బాలుడి ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళలు పొదుపు సంఘాల్లో చేరాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

సుభాష్‌నగర్: మహిళలు స్వతంత్రంగా తమ కాళ్లపై తాము నిలబడాలంటే అర్హులైన ప్రతి ఒక్క మహిళ పొదుపు సంఘాల్లో చేరాలని బాలయ్య నగర్ అధ్యక్షుడు నాగేష్ అన్నారు. ఆదివారం కొత్త గ్రూపులపై కాలనీలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేష్, మహిళ సంఘం అధ్యక్షురాలు పార్వతి, ఆర్పీ ధనలక్ష్మి మాట్లాడారు. గతంలో 16 గ్రూపులు ఉండగా, ఆరు నెలల వ్యవధిలో 25 గ్రూపులను తయారు చేశామన్నారు. స్థానికంగా మొత్తం 50 గ్రూపుల ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా పావలా వడ్డీతో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు.

14న రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘం ఎన్నికలు



నామినేషన్లు వేసిన శ్రీనివాసచారి, లక్ష్మణ్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో స్థానిక సంక్షేమ సంఘం ఎన్నికల నగారా మోగింది. ఈ నెల 7, 8 తేదీల్లో నామినేషన్ల దాఖలు, 9న నామినేషన్ల ఉపసంహరణ, 14న ఎన్నికల ప్రక్రియ. అదే రోజు గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుంది. అందులో భాగంగా సంక్షేమ సంఘం ఎన్నికలకు సంబంధించి ఆదివారం నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఆదివారం స్థానిక నివాసి తల్లోజు శ్రీనివాస్ ఆచారి అధ్యక్ష పదవికి, లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శికి నామినేషన్లు దాఖలు చేశారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

మోతీనగర్: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు పోస్ట్‌కార్డు ఉద్యమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. మోతీనగర్ పోస్టాఫీస్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్, మోతీనగర్‌కు చెందిన ఉద్యమకారులు రాహుల్‌గాంధీకి పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మలిదశ సీనియర్ ఉద్యమకారుడు ఇంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, ప్రతి నెలా 25 వేల పింఛన్, స్వాతంత్ర్య సమరయోధులుగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తిస్తూ శాశ్వత గుర్తింపు కార్డును వీలైనంత త్వరలో అందజేయాలని కోరారు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారుల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ఎంతోమంది అమరవీరుల త్యాగఫలంతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు.

పౌర సేవల్లో జాప్యం !

సిబ్బంది కొరత.. నామమాత్రంగా వార్డు ఆఫీసర్లు

- పరిశీలనకే పరిమితమైన ధ్రువీకరణ పత్రాలు
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 34 పురపాలికలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలిక సంఘాల్లో సిబ్బంది కొరతతో పురసేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించినప్పటికీ, 'ఎక్కడ వేసిన గొంగడి.. అక్కడే' అన్న చందంగా ఉంది. ఫలితంగా సిటిజన్ చార్టు అమలునకు నోచుకోవటం లేదనే విమర్శలను ఎదుర్కొంటోంది. కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే పుర వ్యవహారం నడుస్తుండటంతో వార్డు అధికారుల పాత్ర నామమాత్రమవుతోందనే ఆరోపణలున్నాయి.

అదనపు భారం పడకుండా..

- పురపాలికల్లో ఆదాయ వనరులను పెంచేందుకు తగిన వ్యూహంతో ముందుకుసాగాల్సిన అధికార యంత్రాంగం లేఅవుట్లు, ఇళ్లు, బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతులకు దొడ్డిదారిన సంపాదించే అక్రమార్జనపై చూపినంత శ్రద్ధను పలువురు పుర అధికారులు.. ప్రభుత్వానికి సమకూర్చాల్సిన ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించటం లేదని విమర్శలు ఎదురవుతున్నాయి.
- పురపాలక సంఘాల్లో వార్డు అధికారులకు ఇటీవల ఉన్నతాధికారులు అప్పగించిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాల పరిశీలన బాధ్యతలను చూడాల్సి ఉన్నప్పటికీ.. ఆయా కమిషనర్ల చర్యలకు అనుగుణంగా విధులను నిర్వహించాల్సి వస్తోంది. దీంతో వార్డు అధికారులు తమకు అప్పగించిన పనులను నామమాత్రంగా మాత్రమే చేపడుతున్నట్లు తెలుస్తోంది.
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 34 పురపాలికల్లో వార్డు అధికారుల ప్రమేయం కొంతమేరే ఉంటోంది. వార్డు అధికారులు అన్ని పనుల్లో కీలకపాత్ర పోషించాల్సి ఉన్నప్పటికీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లో విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు.

పత్రాల జారీలోనూ జాప్యమే..

- పురపాలక సంఘాల నుంచి ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. సంబంధిత పత్రాలు సకాలంలో జారీ కాకపోవడంతో ఆఫీసుల్లో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో సంబంధిత కార్యాలయాల చుట్టూ.. ప్రజలు తిరగాల్సి వస్తోంది. సాధారణంగా నగరాలు/ పట్టణాల్లో ఇటీవల జనన, మరణ ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు అధికంగా వస్తున్నాయి. దీనికితోడు పురపాలికల్లో కొనసాగుతున్న ప్రత్యేక పాలన నేపథ్యంలో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

అనుమతులు పొందడానికి పాట్లు

- ఇంటి నెంబర్లు, మ్యూటేషన్లు నల్లా అనుమతులు పొందడానికి కూడా స్థానిక ప్రజలు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఎంతో కొంత సమర్పించుకుంటేనే గానీ పనులు ముందుకు సాగడం లేదని, లేనిపక్షంలో సరైన పత్రాలు లేవన్న కారణాలతో కొర్రీలు పెడుతూ.. మరింత జాప్యం చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

ఇంటినెంబర్లలో కూడా..

- పురపాలక సంఘాల్లో అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంటినెంబర్లు కేటాయించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్న ఆరోపణలు ఆయా పట్టణాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఇంటి నంబరు సకాలంలో కేటాయించని పలువురు పుర అధికారులు ఏళ్ల తరబడి భవనాలు నిర్మించుకుని విద్యాసంస్థలు, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు, ఓయో పేరుతో చర్యలకు పాల్పడుతున్న వారిపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శిస్తున్నారు.

ఏళ్ల తరబడి వదిలేసిన వైనం

- పురపాలక సంఘాల్లో ఏళ్ల తరబడి ఇళ్లు ,బహుళ అంతస్తులు నిర్మించుకుని, ఇంటి నెంబర్లు పొందకుండానే విద్యాసంస్థలు, వివిధ రకాల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నప్పటికీ పుర కమిషనర్లు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. కొత్త ట్రేడ్ లైసెన్సు జారీ, రెన్యూవల్ విషయాల్లో కూడా పుర అధికారుల ఉదాసీనత, ఆదాయ వనరుల పెంపునకు విఘాతం కలిగిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. వీటిపై ఆయా జిల్లాల అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.